క్లుప్తంగా

బ్రహ్మోత్సవాల నిర్వహణపై నేడు సమావేశం

రాయదుర్గంటౌన్: పట్టణంలోని కోటలో ప్రసన్న వేంకటరమణస్వామి బ్రహ్మోత్సవాలను మే 3 నుంచి నిర్వహించనున్నట్లు దేవాదాయశాఖ కార్యనిర్వహణాధికారి కె.నరసింహారెడ్డి తెలిపారు ఉత్సవాల నిర్వహణపై పాలకవర్గ సభ్యులు, పట్టణ ప్రజలు, పుర ప్రముఖుల సలహాలు, సూచనల కోసం శుక్రవారం ఉదయం 11 గంటలకు ఆలయంలో సమావేశం నిర్వహిస్తామన్నారు.

11న ఇంటర్వ్యూలు

కళ్యాణదుర్గం: స్థానిక ఆర్డీఓ కార్యాలయ ఆవరణలో ఈ నెల 11న అంగన్‌వాడీ పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు సీడీపీఓ లక్ష్మీప్రసన్న తెలిపారు. ఈ మేరకు గురువారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. కళ్యాణదుర్గం ప్రాజెక్టు పరిధిలోని వర్లి మినీ అంగన్‌వాడీ కార్యకర్త-1, నాలుగు ఆయా పోస్టులకు 12 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నట్లు ఆమె తెలిపారు.

పురాతన ఆలయాలను పరిరక్షిస్తాం

కుందుర్పి: పురాతన ఆలయాలను పరిరక్షిస్తామని పురావస్తు శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీ) రజిత తెలిపారు. మండలంలోని మలయనూరులో చోళ చాళుక్యుల కాలంలో నిర్మించిన పంచ లింగాల ఆలయం, కుందుర్పి కోదండరామ స్వామి, గుమ్మట దేవాలయం, ఆంజనేయస్వామి ఆలయం, వీరభద్రస్వామి ఆలయం, బల్లేపల్లి మఠంలను ఆమె పరిశీలించారు. శిథిలమవుతున్న ఆలయాల జీర్ణోద్ధారణకు కావాల్సిన నిధుల కోసం రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదన పంపుతున్నట్లు తెలిపారు. ఆమె వెంట చరిత్ర అధ్యాపకుడు రమేష్, సిబ్బంది శ్వేతవాహన, స్థానిక ఉపసర్పంచ్ లక్ష్మీకాంత్ తదితరులు ఉన్నారు.

సమయపాలన పాటించండి


మాట్లాడుతున్న డీఎల్‌డీఓ శంకర్

శెట్టూరు: సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించాలని డీఎల్‌డీఓ శంకర్ సూచించారు. గురువారం మండలంలోని యాటకల్లు గ్రామ సచివాలయంలో డీఎల్‌డీఓ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. వీఆర్‌ఓ, సర్వేయర్, పంచాయతీ కార్యదర్శి విధులకు గైర్హాజరవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం నూతనంగా నిర్మిస్తున్న గ్రామ సచివాలయం, ఆర్బీకే భవనాలను ఆయన పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శి మంజుల, సచివాలయ సిబ్బంది ఉమ, మంజునాథ, కవిత, జయశ్రీ, అనిల్, వలంటీర్లు పాల్గొన్నారు.

బియ్యం, బేడల వేలం

ఉరవకొండ రూరల్: మండలంలోని పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో భక్తులు సమర్పించిన బియ్యం, బేడలను గురువారం ఆలయ ఇన్‌స్పెక్టర్ రామతులసి, ఆలయ ప్రధాన కార్యనిర్వహణాధికారి కె. విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో వేలం నిర్వహించారు. కోనాపురం గ్రామానికి చెందిన వి.హనుమంతు కిలో రూ. 14.10 పైసలకు వాటిని దక్కించుకున్నారు. మేలో నిర్వహించే బ్రహ్మోత్సవాల సందర్భంగా దేవస్థానం ఆవరణలో చేపట్టే వివిధ రకాల పనులకు సీల్డ్ టెండర్ కోరగా ఎవరూ ముందుకు రాలేదని ఈఓ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

రైతు ఆత్మహత్యపై విచారణ

కూడేరు: మండలంలోని కలగళ్లకు చెందిన రైతు మీనుగ సంజీవ ఇటీవల అప్పులబాధతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న విషయం విదితమే. గురువారం మండల వ్యవసాయాధికారి నవత, ఏఈఓ శైలజ తదితరులు మృతుని ఇంటికి వెళ్లి అతని భార్య శాంతమ్మను పరామర్శించారు. ట్రాక్టర్ రుణం, బోర్లు వేసేందుకు, పంటల సాగుకు చేసిన అప్పులు అధికమవ్వడంతో ఆత్మహత్యకు పాల్పడినట్లు ఆమె అధికారులకు వివరించారు. సర్పంచ్ సువర్ణమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు ఓబుళమ్మ, వీఏఏ అనుపమ, గ్రామస్తులు పాల్గొన్నారు.

'మొండి' మాయ..!


దారంతా కనిపిస్తున్న కంపచెట్లు

డి హీరేహాళ్(రాయదుర్గం): టీడీపీ ఎంపీటీసీ మొండి మల్లికార్జున మాయ బయటపడింది. డి హీరేహాళ్ మండలంలోని సోములాపురం – చెర్లోపల్లికి వెళ్లే నాలుగు కిలోమీటర్ల రహదారికి ఇరువైపులా పెరిగిన కంపచెట్లను సొంత ఖర్చులతో తొలగించానంటూ కొన్ని అనుకూల పత్రికల్లో కథనాలు రాయించుకుని గురువారం పెద్దఎత్తున సోషల్ మాధ్యమాల్లో వైరల్ చేశారు. రెండు గ్రామాల ప్రజలు, సర్పంచ్ అక్కడికెళ్లి పరిశీలించగా.. అదే దారిలోనున్న ఆయన పొలం వద్ద 300 అడుగుల వరకూ కంపచెట్లు తీయించి చేతులు దులిపేశాడు. లేనిది ఉన్నట్టు .. ఉన్నది లేనట్టుగా అభూత కల్పన చేయడంలో టీడీపీ నాయకులకు వెన్నతోపెట్టిన విద్యగా చెప్పుకోవచ్చని అక్కడికి వెళ్లిన వారంతా విమర్శలు సంధించారు. అనంతరం కంప చెట్లు ఉండే ఫొటోలు తీయించి మొండి నిర్వాకంపై సోషల్ మాధ్యమాల్లో తిరిగి వైరల్ చేయించగా.. చూసి ప్రజలు నవ్వుకున్నారు.

పేదల పాలిట వరం 'ఫ్యామిలీ డాక్టర్'

● ప్రభుత్వ విప్ కాపురామచంద్రారెడ్డి


104 వాహనాన్ని ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి

బొమ్మనహాళ్: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిరుపేదల పాలిట వరమని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. గురువారం నేమకల్లు గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంతోపాటు 104 వాహనాన్ని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గతంలోలా వైద్యం కోసం డాక్టర్ల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా మన ఊరిలోనే మన ఇంటి వద్దే ఉచిత వైద్యం అందించే ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఉన్న ఊరిలోనే ఉచిత వైద్యంపై దృష్టి పెట్టిన ప్రభుత్వం ఇదే అని అన్నారు. మంచానికే పరిమితమైన రోగులకు ఇంటి వద్దే వైద్యం అందించేందుకు ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని తీసుకువచ్చామన్నారు. వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లో 105 రకాల మందులు, 14 రకాల వైద్య పరీక్షలు అందుబాటులో ఉంటాయని, స్పెషలిస్ట్ డాక్టర్లతో టెలిమెడిసన్ కన్సల్టేషన్ సౌకర్యం కూడా అందుబాటులో ఉంటుందన్నారు. 99 శాతం రోగాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్యశ్రీలోకి తీసుకొచ్చారన్నారు. కోవిడ్‌ను ఎదుర్కొనేందుకు రాష్ట్రంలో 25 వేల మంది వైద్య సిబ్బందిని ప్రభుత్వం నియమించిందన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారిణి మల్లీశ్వరి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఈశ్వర రెడ్డి, సీనియర్ నేత చంద్రశేఖర్‌రెడ్డి, సర్పంచ్ పరమేశ్వర, వైస్ ఎంపీపీ రమేష్, హెల్త్ ఎడ్యుకేటర్ విజయభారతి, సూపర్‌వైజర్ యుగంధర్, వైద్య సిబ్బంది, 104 సిబ్బంది పాల్గొన్నారు.

వైద్యసేవలు సద్వినియోగం చేసుకోవాలి

గుమ్మఘట్ట: మారుమూల గ్రామీణ ప్రాంత ప్రజలకు ఉత్తమ వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని ప్రవేశపెట్టిందని పీహెచ్‌సీ వైద్యుడు రమేష్ గురువారం తెలిపారు. మండలంలోని సిరిగెదొడ్డి, భూపసముద్రం గ్రామాల ప్రజలకు వైద్యసేవలను ఫ్యామిలీ డాక్టర్లు బాలాజీనాయక్, రాంకిశోర్ అందించినట్లు ఆయన తెలిపారు. వైద్య రంగంలో అనతికాలంలో సీఎం జగన్‌మోహన్ రెడ్డి విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చి మార్గదర్శకులయ్యారన్నారు. నిరుపేదలకు వైద్యసేవలు అందించాలన్నదే సీఎం లక్ష్యం అన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఆదిబయమ్మ, హెల్త్ అసిస్టెంట్ సుధాకర్‌రెడ్డి, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.

రూ.9 కోట్లతో రోడ్డు విస్తరణ పనులు


రోడ్డు పనులకు భూమిపూజ చేస్తున్న మంత్రి కేవీ ఉషశ్రీచరణ్

కళ్యాణదుర్గం: పట్టణాభివృద్ధే ధ్యేయంగా స్థానిక టీ సర్కిల్ నుంచి కంబదూరు రింగ్ రోడ్డు వరకూ రూ.9 కోట్లతో రోడ్డు విస్తరణ పనులు చేపడుతున్నామని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ అన్నారు. స్థానిక కంబదూరు రింగ్ రోడ్డు సమీపంలో గురువారం రోడ్డు విస్తరణ పనులకు మంత్రి భూమి పూజ చేసి ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ పట్టణంలో ట్రాఫిక్ అంతరాయం లేకుండా, ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు రోడ్డు విస్తరణ పనులు చేపడుతున్నామన్నారు. టీ సర్కిల్ నుంచి కంబదూరు రోడ్డు వరకూ సుమారు 2 కిలోమీటర్ల మేర రోడ్డు పనులు చేస్తామన్నారు. పనులను నాణ్యతగా చేయాలని కాంట్రాక్టర్ వెంకటనాగిరెడ్డికి సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చోట నిబంధనల మేరకు డ్రైనేజీలు ఏర్పాటు చేసి త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. అనంతరం మంత్రి జేసీబీ ఆపరేట్ చేస్తూ రోడ్డు పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశులు, వైస్ చైర్మన్ జయం ఫణి, మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ బిక్కి నాగలక్ష్మి, నాయకులు నరేంద్రరెడ్డి, తిరుమల వెంకటేశులు, సుధీర్, లక్ష్మన్న, ఎంపీపీ మారుతమ్మ, అఫ్జల్, షెక్షావలి, ఉమేష్, అర్చన, ఆంజినేయులు, బాలా సోము, ఉమాపతి, వెంకటేశులు, ములకనూరు గోవిందు, తమ్మన్న, బిక్కిహరి తదితరులు పాల్గొన్నారు.

ప్రతిష్టాత్మకంగా 'మా నమ్మకం నువ్వే జగన్'


'మా నమ్మకం నువ్వే జగన్' పోస్టర్లను విడుదల చేస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వ, ప్రణయ్‌రెడ్డి

ఉరవకొండ: 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టాలని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి పిలుపునిచ్చారు. గురువారం స్థానిక తొగట వీర క్షత్రియ కల్యాణ మండపంలో 'మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమంపై సమీక్ష నిర్వహించారు. సచివాలయ రూరల్ కన్వీనర్ తేజోనాథ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సచివాలయ వలంటీర్లు ఇచ్చిన బుక్‌లెట్‌లను ప్రతి ఇంటికీ తీసుకెళ్లి ప్రభుత్వ పనితీరుపై అభిప్రాయాన్ని సేకరించాలన్నారు. 14 రోజుల పాటు జరిగే కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలన్నారు. టీడీపీ నాయకులు, పచ్చపత్రికలు ప్రభుత్వంపై చేస్తున్న తప్పుడు ప్రచారం వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తిప్పికొట్టాలన్నారు. పార్టీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జ్ వై.ప్రణయ్‌రెడ్డి మాట్లాడుతూ జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని ఈనెల 7 నుంచి 20 వరకూ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు వీరన్న, పంచాయతీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు బసవరాజు, ఐదు మండలాల సచివాలయాల కన్వీనర్లు భరత్‌రెడ్డి, ఆసీఫ్, కురుబ దేవేంద్ర, రామాంజనేయులు, రాచన్నగౌడ్, ఉరవకొండ, విడపనకల్లు, కూడేరు మండలాల ఎంపీపీలు చంద్రమ్మ, పుష్పవతి, నారాయణరెడ్డి, కురుబ, ఎంబీసీ కార్పొరేషన్ డైరెక్టర్లు గోవిందు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

కంబదూరు: మండలంలో ఈనెల 7 నుంచి చేపట్టనున్న జగనన్నే మన భవిష్యత్ కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని సచివాలయాల మండల కన్వీనర్ సాకే గంగాధర్ సూచించారు. గురువారం మండల కేంద్రంలోని సచివాలయం-1లో వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లకు జగనన్నే మన భవిష్యత్ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టత్మకంగా తలపెట్టిన జగనన్నే మన భవిష్యత్ కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామన్నారు. కార్యక్రమంలో రైతు విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి నీలి శంకరప్ప, ఎంపీటీసీలు మీసేవ కుమార్, మల్లేష్, సచివాలయ కన్వీనర్లు రామస్వామి, రిజ్వాన్, కిరణ్, నాయక్, నాయకులు విల్సన్, వెంకటేశులు, పవన్, ఫయాజ్, దాదు తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గంటౌన్: పురపాలకసంఘంలోని వార్డు సచివాలయాల పరిధిలో కన్వీనర్లు, గృహ సారథులు, వార్డు వలంటీర్లు, కౌన్సిలర్లు సమష్టిగా ప్రభుత్వ పథకాలపై విస్తృత ప్రచారం నిర్వహించాలని గురువారం క్షేత్రస్థాయిలో సమావేశాలతో పార్టీ శ్రేణులు సిద్ధమయ్యారు. శుక్రవారం నుంచి ప్రారంభమయ్యే జగనన్నే మన భవిష్యత్ కార్యక్రమం నిర్వహణపై వార్డుల్లో గృహ సారథులు, కన్వీనర్లు, వలంటీర్లతో కౌన్సిలర్లు సమావేశాలు నిర్వహించి చర్చించారు.

సంక్షేమ పథకాలపై నాటక ప్రదర్శన

కూడేరు: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల అమలు, లబ్ధిపై గురువారం రాత్రి మండలంలోని కడదరకుంటలో రాష్ట్ర సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో భగవాన్ సత్యసాయి బాబా నాటకోత్సవ సమితిచే నాటక ప్రదర్శన నిర్వహించారు. జగనన్న జయకేతనం నాటకం ద్వారా ప్రజలకు ఏ ఏ సంక్షేమ పథకంతో ఎంత లబ్ధి చేకూరుతుందో కళాకారులు వివరించి చైతన్య పరిచారు. కార్యక్రమంలో కళాకారులు నారాయణ స్వామి, గుజ్జుల శ్రీనివాసులు, హనుమంతు,రజిని, వాణి, నాటక సమితి సంఘం అధ్యక్షుడు మైకేల్ బాబు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమి పూజ

కుందుర్పి: మండలంలోని కెంచంపల్లి సమీపంలో ఆర్డీటీ పర్యవేక్షణలో రూ.12 కోట్లతో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులకు వాల్మీకి ఫెడరేషన్ డైరెక్టర్ పాలాక్షి గురువారం భూమిపూజ చేశారు. కెంచంపల్లితో పాటు కొలిమిపాళ్యం, కలిగొలిమి, జంబుగుంపల తదితర గ్రామాల్లో నీటి కుంటల నిర్మాణం, భూఅభివృద్ధి పనులు, పాడిపశువుల పెంపకం, పండ్లతోటల పెంపకం, చెక్‌డ్యాముల నిర్మాణాలు తదితర అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ఆ సంస్థ మండల కోఆర్డినేటర్ వెంకటేశులు ఎస్టీఎల్ హనుమంతరాయుడు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆర్డీటీ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల ద్వారా పేద కుటుంబాలు, రైతు కూలీలు ఆర్థిక పురోగతి సాధించేందుకు ఆస్కారముందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గంగాధర, రైతులు తదితరులు పాల్గొన్నారు.

అత్తపై కోడలి కుటుంబ సభ్యుల దాడి

కళ్యాణదుర్గం: మండలంలోని ఉప్పొంక గ్రామంలో అత్తపై కోడలి కుటుంబ సభ్యులు దాడి చేసిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. ఉప్పొంకకు చెందిన రామక్క, గుర్రప్ప కుమారుడు రాజశేఖర్‌కు రెండేళ్ల క్రితం గార్లదిన్నె మండలం ముకుందాపురానికి చెందిన మల్లీశ్వరితో వివాహం జరిపించారు. కుటుంబ కలహాల నేపథ్యంలో కోడలు తన కుటుంబ సభ్యులను పిలిపించి అత్త రామక్కపై దాడి చేయించింది. ఆమెను భర్త, కుమారుడు కళ్యాణదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కాగా ఘటనపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

నివాళి

వజ్రకరూరు: మండలంలోని పొట్టిపాడుకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు మునిరెడ్డి సతీమణి పీపీ. సుశీలమ్మ(60) బ్రెయిన్ ట్యూమర్‌తో హైదరాబాద్‌లోని కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందారు. గురువారం మృతదేహాన్నిపొట్టిపాడుకు తీసుకువచ్చారు. విషయం తెలుసుకున్న ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి ఆ గ్రామానికి చేరుకుని మృతదేహంపై పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. జిల్లా అగ్రి అడ్వైజరీబోర్డు చైర్మన్ టి.రాజశేఖర్‌రెడ్డి, బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు సీపీ.వీరన్న తదితరులు పాల్గొన్నారు. కాగా సుశీలమ్మ దేహంలోని పలు అవయవాలను కుటుంబీకులు ఆస్పత్రికి దానం చేశారు.

విధి నిర్వహణలో నమ్మకంతో పనిచేయండి


ఎంపికైన వారికి పత్రాలను అందజేస్తున్న మంత్రి ఉషశ్రీ చరణ్, ఏఎస్పీ నాగేంద్రుడు

కళ్యాణదుర్గం: విధి నిర్వహణలో ప్రతి ఒక్కరూ నిబద్ధతతో పనిచేయాలని మంత్రి ఉషశ్రీచరణ్ సూచించారు. స్థానిక శ్రీనివాస కల్యాణ మండపంలో గురువారం జిల్లా పోలీసు శాఖ, పీవీఎస్ఆర్ గ్రూప్స్ సంయుక్త ఆధ్వర్యంలో పరివర్తన పేరుతో మెగా జాబ్‌మేళా నిర్వహించారు. కళ్యాణదుర్గం డీఎస్పీ బి.శ్రీనివాసులు అధ్యక్షతన జరిగిన మేళాకు ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి మాట్లాడుతూ యువత అబ్దుల్ కలాం, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ లాంటి మహనీయుల జీవితాలను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. యువతీ యువకులు ఉన్నత లక్ష్యంతో ముందుకెళ్లాలని అడిషనల్ ఎస్పీ నాగేంద్రుడు సూచించారు. అనంతరం యాక్సిస్, కోజెంట్, బైజూస్, హెటిరో, ముత్తూట్ ఫైనాన్స్, అమరరాజా వంటి 20 కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. 587 మంది హాజరుకాగా 318 మంది ఉద్యోగాలను పొందినట్లు పీవీఎస్ఆర్ గ్రూప్ సీఈఓ గోపీచంద్ తెలిపారు. అనంతరం ఉద్యోగాలు సాధించిన వారికి అర్హత పత్రాలను అతిథులు అందజేశారు. కార్యక్రమంలో సీఐ శ్రీనివాసులు, ఎస్ఐలు నాగమధు, సుధాకర్, రాజేష్, కృష్ణమూర్తి, ఆశా బేగంలతో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా సంగమేశ్వరుడి కల్యాణోత్సవం


బొమ్మనహాళ్: కల్యాణోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం


బ్రహ్మసముద్రం: కుంకుమార్చన చేస్తున్న మంత్రి ఉషశ్రీచరణ్

బొమ్మనహాళ్: మండలంలోని శింగానహళ్లి గ్రామ సమీపంలోని వేదావతి చిన్న, పెద్ద హగరి నదుల కలిసే కూడలిలో గురువారం సంగమేశ్వరస్వామి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉదయం 9 గంటలకు సంగమేశ్వరస్వామి విగ్రహాలను శింగానహళ్లి నుంచి ఊరేగింపుగా సంగమేశ్వరాలయానికి డబ్బు వ్యాయిద్యాల మధ్య తీసుకొచ్చారు. ఉదయం 10 గంటలకు రుద్రాభిషేకం, ఆకుపూజ నిర్వహించారు. అనంతరం సంగప్ప, సంగమ్మ కల్యాణోత్సం చేపట్టారు. శుక్రవారం సాయంత్రం 5 గంటలకు సంగమేశ్వరస్వామి రథోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్ కాపురామచంద్రారెడ్డి హాజరవుతారన్నారు.

లక్ష్మీ రంగనాథుడిని దర్శించుకున్న మంత్రి

కళ్యాణదుర్గం (బ్రహ్మసముద్రం): బ్రహ్మసముద్రం మండలంలోని వేపులపర్తి లక్ష్మీ రంగనాథ స్వామిని మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ దర్శించుకున్నారు. గురువారం పౌర్ణమి సందర్భంగా ఆలయానికి వెళ్లి ప్రత్యేక పూజలు జరిపించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మంత్రికి పూర్ణకుంభంతో స్వాగతం పలికి, కుంకుమార్చన చేయించారు. అనంతరం అర్చకులు మంత్రిని సన్మానించి పూలు, పండ్లు సమర్పించి ఆశీర్వదించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బసవరాజు, ఖాదీ, విలేజ్ ఇండస్ట్రీ స్టేట్ డైరెక్టర్ కమలాక్షి, సర్పంచు రంగప్ప, నాయకులు చంద్రశేఖర్, అయ్యన్న, నజీర్‌సాబ్, ఎర్రిస్వామి, లక్ష్మీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జనార్దన వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం


స్వామి మూలవిరాట్

వజ్రకరూరు: మండల కేంద్రంలో జనార్దన వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. 11వ తేదీ వరకూ ఉత్సవాలు నిర్వహించనున్నారు. శుక్రవారం హంస వాహనం, శనివారం హనుమద్ వాహనము, ఆదివారం కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు ఈఓ అంగదాల క్రిష్ణయ్య తెలిపారు. సోమవారం బ్రహ్మోరథోత్సవం, మంగళవారం పల్లకీసేవ, వసంతోత్సవం ఉంటుందన్నారు. ధర్మకర్తల మండలి చైర్మన్ వెంకటేశ్వరరెడ్డి, అర్చకుడు నరసంహామూర్తి, జూనియర్ అసిస్టెంట్ లాలేష్, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు. కాగా బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికలను గురువారం ఉరవకొండ పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై. విశ్వేశ్వరరెడ్డి ఆవిష్కరించారు. వజ్రకరూరు గ్రామానికి చెందిన ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు మాజీ ఎమ్మెల్యేను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించారు.

ఘనంగా చిక్కణ్ణేశ్వరస్వామి ఉత్సవం


కణేకల్లు: స్వామి ఉత్సవ దృశ్యం

కణేకల్లు: మండల కేంద్రంలో గురువారం రాత్రి చిక్కణ్ణేశ్వరస్వామి ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో స్వామికి వేదవతి హగిరి నుంచి తెచ్చిన గంగజలాలతో అభిషేకం చేశారు. రాత్రి 8గంటల సమయంలో ప్రత్యేకంగా అలంకరించిన రథంలో స్వామి ఉత్సహ విగ్రహాన్ని ఉంచి మేళాతాళాలు, తప్పెట్ల నడుమ ఊరేగించారు. కార్యక్రమంలో ధర్మకర్త జె.ప్రసాద్‌రెడ్డి, మాజీ ధర్మకర్త బారిక రామ్మూర్తి, పట్టణ వైఎస్సార్‌సీపీ కన్వీనర్ టీ.కేశవరెడ్డి, మండల జేసీఎ కన్వీనర్ హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు. శుక్రవారం సాయంత్రం నిర్వహించే రథోత్సవానికి ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, జిల్లా రెడ్ క్రాస్ సోసైటీ చైర్ పర్సన్ కాపు భారతి హాజరుకానున్నారు.

తిమ్మదాసులస్వామి ఆరాధనోత్సవం

బొమ్మనహాళ్: ఈ గుప్ప: మండలంలోని ఎర్రగుడి కొట్టాలలో గురువారం గురుసిద్ధప్పస్వామి పీఠం తిమ్మదాసు స్వాముల ఆరాధన ఉత్సవం భక్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలోని గురు సిద్దప్పస్వామి మూల విరాట్‌ను ప్రత్యేక అలంకరణ చేసి భగవద్గీత పూజ, గంగపూజ, గోపూజ, ప్రత్యేక పంచామృతాభిషేకాలను చేశారు. సాయంత్రం తిమ్మదాసులు, త్యాగానందస్వామి, భగళాముఖీ అమ్మవారి ఉత్సవ చిత్రపటాలను నూతనంగా చేయించిన ప్రభలో ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. స్వామి మూలవిరాట్‌తో పాటు భగలాంభదేవి విగ్రహానికి ప్రత్యేక పూజలను చేపట్టారు. రాత్రికి గురుపూజ అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం భజన కార్యక్రమం చేపట్టారు.

కనుల పండువగా రథోత్సవాలు


ఉరవకొండ రూరల్: రాకెట్ల గ్రామంలో సుంకలమ్మ రథోత్సవం నిర్వహిస్తున్న భక్తులు


కుందుర్పి: ఆంజనేయస్వామి రథాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

ఉరవకొండ రూరల్: మండలంలోని రాకెట్ల గ్రామంలో సుంకలమ్మదేవి రథోత్సవం గురువారం ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై. మధుసూదన్‌రెడ్డి వేర్వేరుగా అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం భక్తుల సమక్షంలో ఆలయం చుట్టూ రథాన్ని లాగారు. కార్యక్రమంలో సర్పంచ్ దయ్యాల శివమ్మ, భక్తులు పాల్గొన్నారు.

జై జంబుకేశ్వరస్వామి..

రాయదుర్గంటౌన్: పట్టణంలోని కోటలో వెలసిన స్వయంభు జంబుకేశ్వరస్వామి బ్రహ్మరథోత్సవం గురువారం వైభవంగా నిర్వహించారు. అర్చకులు, బ్రాహ్మణ సంఘం, దేవదాయశాఖ ఈఓ నరసింహారెడ్డి ఆధ్వర్యంలో మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు చేసి ఉదయం 11 గంటలకు మడుగుతేరు లాగారు. సాయంత్రం 5 గంటలకు బ్రహ్మ రథోత్సవం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై మొక్కులు తీర్చుకున్నారు. శుక్రవారం పారేట ఉత్సవం, బాణసంచా వేడుక, అశ్వ వాహనోత్సవ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఈఓ నరసింహారెడ్డి తెలిపారు.


రాయదుర్గంటౌన్: జంబుకేశ్వరుడి రథాన్ని లాగుతున్న దృశ్యం

నమో ఆంజనేయా..

కుందుర్పి: మండలంలోని బండమీదపల్లిలో గురువారం సాయంత్రం ఆంజనేయస్వామి రథోత్సవం ఘనంగా నిర్వహించారు.ఉదయం స్వామికి అభిషేకం, కుంకుమార్చన, మధ్యాహ్నం మడుగు రథోత్సవం, సాయంత్రం ధూళోత్సవం సందర్భంగా రథాన్ని వందలాది మంది భక్తుల సాయంతో ఊరేగించారు ఎస్ఐ కృష్ణమూర్తి బందోబస్తు ఏర్పాటు చేశారు.

జంబులింగేశ్వస్వామి రథోత్సవం

విడపనకల్లు: మండలంలోని హావళిగి గ్రామంలో గురువారం గ్రామస్తుల ఆధ్వర్యంలో జంబులింగేశ్వస్వామి రథోత్సవం వైభవంగా నిర్వహించారు. మండలంలోని కరకముక్కల పాల్తూరు, ఉండబండ, హావళిగి, విడపనకల్లు,వి.కొత్తకోట, పెద్ద కొట్టాలపల్లి, చీకలగురికి తదితర గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను తిలకించారు.

30లోపు ఖాళీ స్థలాల పన్ను చెల్లించండి

కళ్యాణదుర్గం: మున్సిపాలిటీ పరిధిలో ఉన్న ఖాళీ స్థలాల పన్నును ఈనెల 30లోపు ఏక మొత్తంలో చెల్లించాలని కమిషనర్ వెంకటేశులు సూచించారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. పన్ను మొత్తంలో 5 శాతం రిబేట్ (మినహాయింపు) ఇస్తున్నట్లు ఆయన తెలిపారు.